సాక్షి
విజయనగరం
శనివారం ၊ 2 ၊ మార్చి ၊ 2024



మొబైల్ మోసాలపై అప్రమత్తం

మనిషి జీవితం మొబైల్ ఫోన్‌తో ముడిపడిపో యింది. దీనినే ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారు. ఆఫర్ల పేరుతో డబ్బు లు కాజేస్తున్నారు. - IIలో



ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన

జమ్మాదేవిపేట గ్రామంలో శ్రీనందీశ్వరస్వామి తీర్థం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అంతర్‌జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. - IIలో



ఆధునికతతో మంచి అవకాశాలు

ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ విద్యతో మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని విశాఖ ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ నర్రా సురేష్ అన్నారు. - IIలో

న్యూస్‌రీల్

మార్కెటింగ్‌శాఖ ఏడీగా రవికిరణ్



విజయనగరం ఫోర్ట్: మార్కెటింగ్ శాఖ ఏడీగా రవికిరణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రైతు బజార్ల అభివృద్ధికి, ఆదాయం పెంచేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- డీఈఓ ఎం.ప్రేమ్‌కుమార్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

కొత్తవలస: జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఈఓ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 27,277 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని, వీరికోసం 129 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ట్యాబ్‌లతో బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జి.శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేను మీ వాడిని




మూలవలస బీటీ రోడ్డును ప్రారంభించి, గ్రామస్తులతో కలిసి నడుస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: నా తల్లిదండ్రులు అసలైన గిరిజనులు. నేను ఎల్లప్పుడూ మీవాడినేనని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. గిరిజనులను మోసం చేసేందుకు, ఓట్లు దండుకోడానికి నకిలీ గిరిజనులు అబద్ధాలతో మనచుట్టూ తిరుగుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సాలూరు మండలంలోని కొత్తవలస, నార్లవలస, అన్నంరాజువలస గ్రామాల్లో ఐటీడీఏ నిధులు రూ.4.85 కోట్ల ఖర్చుతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర శుక్రవారం భూమిపూజ చేశారు. నిర్మాణం పూర్తయిన మూలవలస బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం గొందివలస, సిమిడి వలసల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ వాడిని కాబట్టే నేను వచ్చిన తరువాత మన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన గ్రామాలకు అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. తాను గడపగడపకు వచ్చినప్పుడు ప్రజలు కోరిన మేరకు ఈ రోడ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. టీడీపీ నాయకుల్లా కొబ్బరికాయలు కొట్టి పనులు గాలికి వదిలే నాయకత్వంలో తాము లేమని సంక్షేమానికి మారుపేరుగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్నామన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

మీరంతా నాకుటుంబం. మీకోసం నేను చేసిన అభివృద్ధి, జగనన్న అందిస్తున్న సంక్షేమం మీ కళ్ల ముందు కనిపోస్తోంది. ఇంతకంటే మీకు ఏం కావాలి. జగనన్నను మళ్లీ మనమందరం కలిసి ముఖ్యమంత్రిని చేద్దాం. అందరూ సిద్ధంగా ఉండండి అని కోరారు. అంతకు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ రాజన్నదొర హయాంలోనే గిరి శిఖర గ్రామాలకు బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు.

పింఛన్ ఆనందం





పింఛన్ అందుకున్న ఆనందంలో నీలవేణి, సత్యవతి

- వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో ప్రథమ స్థానంలో విజయనగరం
- తొలిరోజున 84.35 శాతం మందికి పంపిణీ

విజయనగరం అర్బన్: కోడికూయకముందే వలంటీర్లు వీధివీధికీ వెళ్లారు. లబ్ధిదారుల తలుపులు తట్టారు. ప్రభుత్వం అందించిన పింఛన్ డబ్బులను చేతిలో పెట్టి వారిలో ఆనందం నింపారు. జిల్లాలో 2,84,718 మంది పింఛన్‌దారులు ఉండగా నెలలో తొలిరోజు శుక్రవారం 2,40,161మందికి (84.35 శాతం) పింఛన్లు అందజేసి జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిపారు.



విజయనగరం లంకవీధిలో అప్పలనాయుడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రావణి

పింఛన్ల పంపిణీ ప్రక్రియను సచివాలయ సిబ్బందితో పాటు డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి పర్యవేక్షించారు. జిల్లాలో అత్యధికంగా 92.20 శాతం పంపిణీతో నెల్లిమర్ల అర్బన్ మొదటి స్థానంలో ఉండగా, గజపతినగరం, వేపాడ మండలాలు మినహా అన్ని మండలాల్లోనూ 80 శాతం దాటి పంపిణీ జరిగినట్టు పీడీ తెలిపారు.



విజయనగరం రింగ్‌రోడ్డులో నరసయ్యమ్మ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య

విద్యార్థుల చదువుకు ఆర్థిక దీవెన

- తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.30.31 కోట్లు జమచేసిన ముఖ్యమంత్రి
- జిల్లాలో 43,209 మంది విద్యార్థులకు లబ్ధి
- మెగా చెక్కును అందజేసిన కలెక్టర్



విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నిధుల మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ రామినాయుడు, తదితరులు

విజయనగరం అర్బన్: విద్యారంగానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. పేద పిల్లల చదువుకు ఠంచన్‌గా ఆర్థిక సాయం చేస్తోంది. పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లిస్తోంది. ఉన్నత చదువులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా.. జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థులకు అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన పథకం నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా పామర్రులో శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, లబ్ధిదారులు తిలకించారు. అనంతరం జగనన్న విద్యాదీవెన కింద ఆయా విద్యార్థులు, వారి తల్లులకు ఫీజు మొత్తాలకు సంబంధించిన చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 43,209 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కింద ప్రభుత్వం రూ.30.31 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించిందన్నారు. పేదకుటుంబాల పిల్లల చదువు కోసం వారి తల్లిదండ్రులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వమే పూర్తి ఫీజులు చెల్లిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న వసతులు, సౌకర్యాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 34,992 మంది బీసీ, 3,846 మంది ఎస్సీ, 2,535 మంది ఈబీసీ, 915 మంది కాపు, 611 మంది ఎస్టీ, 266 మంది ముస్లిం, 44 మంది క్రిస్టియన్ విద్యార్థులకు ఆర్థిక లబ్ధికలిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.సందీప్, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్, సహాయ బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు, తదితరులు పాల్గొన్నారు.

చదువుకు చక్కని సాయం



నా పేరు మజ్జి సతీష్. తల్లిదండ్రులు శంకర రావు, సరోజిని వివిధ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జగనన్న ప్రభుత్వం అందించిన సాయంతో నా చదువు కల నెరవేరుతోంది. మా లాంటి పేద కుటుంబాలకు జగనన్న విద్యాదీవెన పథకం ఓ వరం. పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లిస్తుండంతో బొండపల్లి మండలం గొట్లాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ సెకెండియర్ చదువుతున్నాను. మంచి ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఉంది. జగనన్న మేలు మరచిపోలేనిది.

ప్రభుత్వ సాయంతో ఇంజినీరింగ్ విద్య



నా పేరు గెడ్డపు సరిత. మాది గరివిడి పట్టణంలోని డీఎఫ్ఎన్ ఏరియా పరిధిలోని వినాయకకాలనీ. నేను గరివిడిలోని అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. మా నాన్న కిరాణా షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నేను ఇంజినీరింగ్ చదువుతాననే కల నెరవేరుతుందని అనుకోలేదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద ఆర్థిక సాయం అందుతోంది. ఏటా నాలుగు విడతలుగా ప్రతీ మూడు నెలలకోసారి ఒక్కో విడతలో రూ.10,250 చొప్పున ఏడాదికి రూ.41 వేలు మా అమ్మ అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రభుత్వం సాయం చేయకుంటే చదువుకోలేకపోయేదాన్ని. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదకుటుంబాల పిల్లలకు అందిస్తున్న సాయం గొప్పది. ఉన్నత ఉద్యోగం సాధించి ఆయన ఆశయాన్ని నెరవేర్చుతా.

బిందు సేద్యమే బాగు

- జేసీ కార్తీక్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

విజయనగరం ఫోర్ట్: వరి మినహా మిగిలిన పంటలు బిందుసేద్యం విధానంలో సాగుచేయడం సులభమన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ వ్యవసాయ అధికారులకు సూచించారు. బిందు సేద్యం సాగు విస్తీర్ణం పెంచాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు సేద్యం పరికరాలను 5 ఎకరాలలోపు వ్యవసాయం ఉన్న రైతులకు 90 శాతం, 5 ఎకరాల పైబడి ఉన్న వారికి 50 శాతం రాయితీపై ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ధాన్యం దిగుబడిని పెంచేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. దీనిపై జేసీ స్పందిస్తూ ఆర్‌బీకే స్థాయిలో పొలంబడి నిర్వహించి రైతులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించినా పోషక లోపాలను రైతులకు తెలియజేయడం లేదన్న ప్రశ్నకు జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు స్పందించారు. త్వరలోనే నివేదికల ఫలితాలు రైతులకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ వి.చినరామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలమందు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల వయస్సులోపు ఉన్న చిన్నారులందరికీ ఈ నెల 3వ తేదీన పోలియో నివారణలో భాగంగా చుక్కల మందు వేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు పోలియో చుక్కలు వేయించడమే ఏకైక మార్గమన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,98,478 మంది ఉన్నారని, వీరికి పోలియో చుక్కలు వేయడానికి 1182 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుమారు 5 వేల మంది సిబ్బందితో 2,450 బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 192 మంది సూపర్ వైజర్లు, 66 మొబైల్ బృందాలు, 20 ట్రాన్సిట్ బృందాలు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. జిల్లాలో 56 కోల్డ్ చైన్ పాయింట్లను ఏర్పాటు చేశామని, 3,12,000 డోసులను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో 1999లో చివరి సారిగా రెండు పోలియో కేసులు నమోదయ్యాయన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయించడంతో పోలియో నిర్మూలన సాధ్యపడిందన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్చుతకుమారి, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం



విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు హాజరైన విద్యార్థులు

- తొలిరోజు ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం తొలిరోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర తెలుగు–1, సంస్కృతం –1, హిందీ–1, ఒకేషనల్ సబ్జెక్టులకు జరిగింది. పరీక్షలకు మొత్తం 22,253 మంది హాజరుకావాల్సి ఉండగా 1,401 మంది గైర్హాజరయ్యారు. 20,852 మంది పరీక్ష రాశారు. గజపతినగరం శ్రీకృష్ణా జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్టు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి, ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు.



రూమ్ నంబర్ తెలుసుకోవడంలో అభ్యర్థినికి సహాయపడుతున్న పోలీస్ కానిస్టేబుల్

నేడు మంత్రి బొత్ససత్యనారాయణ రాక

విజయనగరం అర్బన్:

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. ఆయన ఉదయం 9.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11 గంటలకు గజపతినగరం మండలం పత్రువాడ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన ఆర్ అండ్‌బీ వంతెనను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి గంగచోళ్ల పెంట చేరుకొని 11.45 గంటలకు రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విజయనగరంలోని తమ నివాసానికి చేరుకుంటారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌కు డిస్క్ అవార్డు

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న టి.ఆనందబాబుకు డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డు వరించింది. ఫిబ్రవరి 29న ఢిల్లీలో బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయంలో డీజీపీ బాలాజీ శ్రీవాత్సవ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఉన్న పోలీస్ అకాడమీ, శిక్షణ కళాశాలలను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీజీపీ (బీపీఆర్‌డీ) కమిటీ సందర్శించి 2021–22 సంవత్సరానికిగానూ విజయనగరం పీటీసీని ఎంపిక చేసిందన్నారు. అవార్డు తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. అధునాతన తరగతి గదులు, వసతులతో మరింత మందికి చక్కని పోలీస్ శిక్షణ ఇస్తామని, పీటీసీ స్థాయి పెంచేందుకు కృషిచేస్తామన్నారు. సమష్టి కృషివల్లే అవార్డు వచ్చిందన్నారు. పీటీసీ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.



బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ డీజీపీ బాలాజీ శ్రీవాత్సవ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

సామాజిక అభివృద్ధి దిశగా సాంకేతిక ఆవిష్కరణలు

విజయనగరం అర్బన్: సామాజిక సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా యువత నుంచి సాంకేతిక ఆవిష్కరణలు రావాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన సాంకేతిక సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సదస్సుల ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన పెరుగుతోందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌స్పైర్ ఎడ్జ్ ఐటీ సొల్యూషన్స్ సీఈఓ నేరెళ్ల నరేంద్ర మాట్లాడుతూ అకడమిక్ విద్యతో పాటు పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. సాంకేతిక ఆవిష్కరణల వైపు యువత అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంకేతిక వర్క్‌షాప్‌లోని వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన వార్షిక పత్రిక 'జైర్–2004' సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి, విభాగ సమన్వయ కర్తలుగా ఎన్.వెంకటేశ్, వై.వి.అమర్‌దేవ్, విద్యార్థుల సమన్వయకర్తలుగా పి.శివకల్కి, ఎం.ప్రనయ వ్యవహరించారు.



వార్షిక పత్రిక 'జైర్-2004' సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ వెంకటసుబ్బయ్య, ప్రొఫెసర్లు

బైక్ అదుపు తప్పి కానిస్టేబుల్ మృతి

బూర్జ: మండలంలోని నీలంపేట గ్రామం శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం బైక్ అదుపు తప్పి కొత్తూరు సురేష్ (38) అనే పోలీస్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఎస్‌ఐ జీవీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగారికి చెందిన సురేష్ ఏడాది కాలంగా బూర్జ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులకు శుక్రవారం హాజరయ్యారు. పరీక్ష పూర్తయ్యాక పేపర్ తరలించే క్రమంలో బందోబస్తుకు బైక్‌పై వెళ్తుండగా దారిలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో కింద పడిపోయారు. వెంటనే అటుగా వెళ్తున్న వారు 108కు సమాచారం అందజేయడంతో ఆయనను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందారు. మృతుడికి భార్య శిరీష ఉన్నారు. ఆయన స్వస్థలం విజయనగరంలో రామానగరం. 2009 బ్యాచ్‌కు చెందిన వారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌లో మృతదేహం ఉంచారు.



విషాదంలో సురేష్ కుటుంబ సభ్యులు





సురేష్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది, మృతి చెందిన కానిస్టేబుల్ కొత్తూరు సురేష్ (ఫైల్)

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారికి వెండి బిందె వితరణ



ఆలయ ఈఓ ప్రసాదరావుకు వెండిబిందెను అందజేస్తున్న దాత శ్రీనివాసరావు దంపతులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి శ్రీకాకుళం జిల్లాలోని పలాస కాశీబుగ్గకు చెందిన యు.శ్రీనివాస్ దంపతులు శుక్రవారం రూ.37వేల విలువైన వెండి బిందెను బహూకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దాతల సహాయ, సహకారాలతోనే ఆలయ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి సహకారమందించాలని కోరారు. ఈ సందర్భంగా దాతలకు వేదపండితులు వేదాశీస్సులు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏడుకొండలు, తాళ్లపూడి ధనుంజయ్, దూసి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వలంటీర్ మృతి



నాగరాజు(ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో పదో వార్డు వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిలారి నాగరాజు అనుమానాస్పద స్థితిలో రైలుపట్టాలపై మృతి చెందాడు. వార్డులో శుక్రవారం పెన్షన్లు పంచేందుకు గురువారం రాత్రి రూ.75వేల నగదును విత్‌డ్రా చేసిన నాగరాజు తెల్లవారేసరికి గున్నతోట వలస వద్ద గల రైలు పట్టాలపై మరణించి ఉన్నాడు. వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబసభ్యులతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని, ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా భావిస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన ధర్మాన రాజు(22) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై వైవీ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం రాజు వృత్తిరీత్యా తాపీ పని చేస్తున్నాడు. కుటుంబాన్ని నెట్టుకురావడంలో ఆర్థికభారంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెంది పురుగు మందు తాగేయడంతో గమనించిన కుటుంబసభ్యులు రాజాం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడి సోదరుడు ఎర్రంనాయుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగలోని సీతారామ కాలనీకి చెందిన గొంప దుర్గాప్రసాద్ (25) శుక్రవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఓ ఇంట్లో సీలింగ్, విద్యుత్ వర్క్ నిమిత్తం ఉదయం 9 గంటలకు శాంతినగర్ రామమందిరం వద్దకు వెళ్లాడు. విద్యుత్ పని పనిచేస్తున్న సమయంలో షాక్ తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. దుర్గాప్రసాద్ సహచరులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతుని తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు నాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 మద్యం బాటిల్స్ స్వాధీనం

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట జంక్షన్ వద్ద పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రామచంద్రపేట గ్రామానికి చెందిన రావి గురుమూర్తి 17 మద్యం బాటిల్స్ తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాతారావు తెలిపారు.

పాలకొండలో మరో 12 బాటిల్స్

పాలకొండ రూరల్: మండలంలోని టీకే రాజపురం కూడలి వద్ద పోలీసులు నిర్వహించిన విజిబుల్ పోలీసింగ్‌లో తూడి గ్రామానికి చెందిన ఎం.సాయిసుందర్ అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా సాయిసుందర్ 12 మద్యం బాటిల్స్ తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం తంపటాపల్లి, తుమరాడ, రాజుపేట గ్రామాల్లో ఎస్సై పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ శాంతిభద్రతల నిర్వహణకు సహకరించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

మొబైల్ మోసాలపై అప్రమత్తం

'ఫ్లిప్‌కార్ట్' సంస్థ మెగా డ్రాలో మీరు విన్నర్‌గా నిలిచారు. రూ.12 లక్షల విలువైన కారు గెలుచుకున్నారు. మీకు కారు కావాలా? డబ్బులు కావాలా? అంటూ ఫోన్ కాల్..తర్వాత కార్ అయినా, డబ్బులైనా పొరపాటున అడిగితే..దేనికైనా ఒక శాతం జీఎస్టీ కడితే వెంటనే మీ ఖాతాలోకి లక్షలు జమ అవుతాయంటూ సైబర్ నేరగాళ్ల వల విసురుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించాలని మాయమాటలతో బురిడీ కొట్టించి, మోసం చేస్తున్నారు. ఇటీవలికాలంలో సైబర్ నేరగాళ్లు చేస్తున్న నయా మోసమిది.

- ప్రముఖ కంపెనీల పేర్లతో ఆఫర్స్
- సైబర్ చీటింగ్‌కు పాల్పడుతున్న నేరగాళ్లు
- అవగాహన కల్పిస్తున్న పోలీస్ యంత్రాంగం



రూ.12 లక్షల కార్ లాటరీలో వచ్చిందంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లో పంపిన ఆఫర్ లెటర్

- హలో..మేము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయింది. కార్డుపైన ఉన్న నంబర్, పాస్‌వర్డ్ చెప్పండి, మళ్లీ మీ ఏటీఎం కార్డును యాక్టివేట్ చేస్తామంటూ అపరిచిత వ్యక్తినుంచి ఫోన్ కాల్..
- మా సంస్థలో ఉద్యోగానికి మీరు ఎంపికయ్యారు. అయితే ముందుగా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అకౌంట్ నంబర్‌కు గడువలోగా డిపాజిట్ చేస్తే మీకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపిస్తామంటూ ఓ ఫోన్ కాల్..ఇలా వస్తున్న ఫోన్ కాల్స్‌ను నమ్ముతున్న చాలా మంది నిరుద్యోగులు, ఉద్యోగులు, యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు.

విజయనగరం క్రైమ్: మనిషి జీవితం మొబైల్ ఫోన్‌తో ముడిపడిపోయింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకూ ఫోన్ పక్కన ఉంటే చాలన్న భావనే ప్రతి ఒక్కరిదీ. ప్రతి పనీ సెల్‌ఫోన్ ద్వారా అయిపోవడంతో మనిషి టెక్నాలజీకీ అలవాటుపడిపోయాడు. అయితే మొబైల్ వాడకం వల్ల లాభమెంత ఉందో..నష్టం కూడా అంగానే ఉందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. ఖాళీగా ఉన్న సమయాల్లో అనవసర మెయిల్స్, లింక్‌లు ఓపెన్ చేయడం, మోసపూరిత ఫోన్‌కాల్స్‌కు సమాధానాలు చెప్పడంతో వారి వివరాలన్నింటినీ సైబర్ నేరగాళ్లు సేకరిస్తూ..ఆఫర్స్ ప్రకటిస్తూ మోసాలకు పాల్పడడం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇటీవలికాలంలో జిల్లాలో పెరుగుతున్న కేసుల సంఖ్యే ఇందుకు సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. ఫోన్‌కాల్ ఏదైనా సరే అప్రమత్తంగా ఉండాల్సింది ప్రజలేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని జిల్లా పోలీసు శాఖ పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ పెడచెవిన పెట్టి మోసపోయిన తర్వాత పోలీసులను ఆశ్రయిస్తున్న సంఘటనలు బాధాకరంగా తయారయ్యాయి.

ఆన్‌లైన్ షాపింగ్ చేసే ప్రముఖ కంపెనీల పేర్లను వాడుకుంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఫోన్ చేస్తున్నారు. పేరు, వివరాలు చెప్పి వారికి ఆఫర్ లెటర్లు వాట్సాప్‌లకు పంపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ప్రధానంగా ఆడవాళ్ల గొంతుతో మాట్లాడిస్తూ వారికి నమ్మకం కలిగించి, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా జీఎస్టీ పేరుతో వేలకు వేలు దోచేస్తున్నారు. ఒకసారి గానీ నమ్మి డబ్బులు పంపిస్తే, మళ్లీ మళ్లీ అవకాశం ఉన్నంత మేరకు నిలువుదోపిడీ చేసి, సెల్ స్విచ్ఛాఫ్ చేసేస్తున్నారు. తీరా మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయితే సంఘటన జరిగిన కొద్దిగంటల్లోనే ఫిర్యాదు చేస్తే వెంటనే బ్యాంక్ అకౌంట్లను నిలువరించే గలిగే పరిస్థితి ఉంటుంది. కానీ రోజులు గడిచిపోతే ఫలితం శూన్యమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సైబర్ నేరాల్లో విజయనగరం జిల్లాలో ఎక్కువగా ఓటీపీ, ఏటీఎమ్ కార్డు మోసాలు, లోన్‌యాప్, ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు జిల్లా పోలీసులు, గ్రామస్థాయిలో మహిళా పోలీసులు స్థానిక పోలీసులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

సైబర్ నేరాలపై 2021లో 106 కేసులు, 2022లో 141 కేసులు, 2023లో 92 కేసులు, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకూ 10 వరకూ కేసులు నమోదైనట్లు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు మహిళా పోలీసులతో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ఏటీఎం కార్డు మోసాలు, ఆన్‌లైన్ జాబ్, ఓటీపీలు చెప్పడంతో జరిగే మోసాల పట్ల డోర్ టు డోర్ వెళ్లి, సైబర్ మోసాలు జరిగే తీరు, లోన్ యాప్‌ల వలన కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాల్సిందే



సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక లావాదేవీలు చేసే ప్రభుత్వ సంస్థల ప్రతినిధులెవరూ ఫోన్‌లో సంప్రదించరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఆఫర్స్ పేరుతో వచ్చే వాటిని నమ్మి మోసపోవద్దు. ఓటీపీలు చెప్పడం వంటివి చేస్తే మీ బ్యాంక్ ఖాతా ఖాళీ అయిపోతుంది. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు, మెయిల్స్, ఫేక్ మెసేజ్‌లకు స్పందించవద్దు. వెంటనే బ్లాక్ చేయాలి. లక్షల రూపాయలిస్తామని, జీఎస్టీ మాత్రమే కడితే సరిపోతుందన్న సైబర్ నేరగాళ్ల మాటలకు గట్టిగా బుద్ధి చెప్పండి. పొరపాటున కూడా వారి వలలో పడవద్దు. జిల్లాలో ప్రత్యేకంగా సైబర్‌సెల్ ఉంది. మోసపోయామన్న బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

ఆధునిక సాంకేతికతతో మంచి అవకాశాలు



లెండి ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా ఎంఓయూ పత్రాలను చూపిస్తున్న సంస్థ డైరెక్టర్ యుక్తేష్, ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి తదితరులు

డెంకాడ: ఆధునిక సాంకేతికతకు అవసరమైన అంశాలను నేర్చుకోవడం వల్ల ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలో మంచి అవకాశాలు పొందవచ్చని విశాఖ ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ నర్రా సురేష్ అన్నారు. ఈ మేరకు లెండి ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇంటెరెస్స్ సహకారంతో ప్లేస్‌మెంట్ సెల్ నిర్వహించనున్న 72 గంటల పాటు హ్యాకథాన్ హ్యాక్‌ట్రియాడ్ శుక్రవారం సందడిగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్రా సురేష్ మాట్లాడుతూ 72 గంటల పాటు హ్యాక్‌థాన్ హ్యాక్‌ట్రియాడ్ చాలెంజ్‌లో విద్యార్థులు పాల్గొనడం వల్ల ఎంతో ప్రయోజనమని చెప్పారు. వార్‌రూం వాతావరణంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఆలోచన, పని సంస్కృతిని సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా డైరెక్టర్ చింతమండక యుక్తేష్ మాట్లాడుతూ హ్యాక్‌ట్రియాడ్ అనేది సృజనాత్మక,జట్టు కృషిని నిర్ణీత వ్యవధిలో సమస్యను వేగవంతంగా పరిష్కరించే డైనమిక్ ప్లాట్‌ఫాం అని తెలిపారు. అనంతరం విషయ విజ్ఞాన పరిశోధన కోసం తరచూ సవాళ్లను నిర్వహించడానికి లెండి ఇంజినీరింగ్ కళాశాల, స్మార్ట్‌బ్రిడ్జి ఇండియా ఎంఓయూ కుదుర్చుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు,సెక్రెటరీ కోడూరు శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ టి.హరిబాబు, కేవీ నరసంహం, ప్లేస్‌మెంట్ డీన్స్ జి.ప్రకాష్‌బాబు, హెచ్‌ఓడీలు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన

- మొదటిస్థానంలో నిలిచిన నెక్కలవానిపాలెం ఎడ్లు



ఉల్లాసంగా దౌడు తీస్తున్న ఎడ్లు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో శ్రీనందీశ్వరస్వామి తీర్థం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అంతర్‌జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీల్లో 16 జతలు ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వరుసగా శ్రీ పైడితల్లమ్మతల్లి (నెక్కలవానిపాలెం), గండి వెంకటరావు (వాయిల్పాడు), శ్రీ సిద్ధివినాయక (వల్లంపూడి), ముమ్మన శివతేజ (నరసయ్యపేట), పరవాడ నాయుడు (అదనగిరి), పోలిపర్తి నాయుడు (కలగాడ)లకు చెందిన ఎడ్లబళ్లు వరుసగా విజయం సాధించాయి. విజేతలకు 12, 8, 6, 4, 2 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ముందుగా నందీశ్వరుడిని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.అనంతరం రాత్రి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి అభినందన



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: ప్రథమ శ్రేణిలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా అన్ని సబ్జెక్టుల్లో బంగారు పతకాలు సాధించిన చీపురుపల్లి పట్టణానికి చెందిన కందుల దుర్గాప్రసాద్‌ను వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు అభినందించారు. పట్టణంలోని ఆంజనేయపురంలో నివాసం ఉంటున్న కందుల భాస్కరరావు, రజని దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీబీఎస్ తాజాగా పూర్తి చేశాడు. అయితే దుర్గాప్రసాద్ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించడంతో వైశ్యవర్తక సంఘం ప్రతినిధులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, కేజే.శ్రీనివాసరావు, కింతలి మధు, ఎస్‌వీజీ.శ్రీనివాసరావు, సూరుకుమార్, సుంకరి తిరుమల, అందవరపు హరిప్రసాద్, అందవరపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల నమోదుకు సహకరించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నమోదు కోసం మార్చి 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టిందని జిల్లాలోని అన్ని ఎంఎస్ఎంఈలు ఈ సర్వేలో నమోదు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రిశ్రమల పనితీరును మెరుగుపరచడం, వాటి అభివృద్ధి కోసం ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్రప్రభుత్వం చేపట్టిన ర్యాంప్ పథకంలో భాగంగా పరిశ్రమల నమోదును చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినేట్ సెక్రటరీలు ఆయా సంస్థలకు సర్వే నిమిత్తం వచ్చినప్పుడు పరిశ్రమల యాజమాన్యాలు తగు సమాచారం ఇచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సర్వేకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తయారీ, సేవా, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురావడం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈ పోర్టల్‌కు అనుసంధానం జరుగుతుందని చెప్పారు. నమోదు కాని వ్యాపారాలను ఉద్యమ్, ఉద్యమ్ ఎసిస్ట్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ సంస్థలకు భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం, మార్కెటింగ్ సదుపాయం కల్పించడం కోసం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేయడం కోసం ఈ సమాచారాన్ని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట త్రివినాగ్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పందాలరాయళ్ల అరెస్ట్

గజపతినగరం: మండలంలోని శాలిపేట గ్రామంలో శనివారం రాత్రి కోడిపందాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై యు.మహేష్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. కోడిపందాల రాయుళ్ల నుంచి నాలుగు కోడిపుంజులను రూ.8, 120 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మారుమూల ప్రాంతాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటు

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో మొబైల్‌సిగ్నల్స్ అందని మారుమూల ప్రాంతాల్లో సెల్‌టవర్‌లు ఏర్పాటు చేయాలని టెలికాం సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. టవర్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వ పరంగా సత్వరమే మంజూరుచేసి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఎస్.కోట, రామభద్రపురం, గంట్యాడ మండలాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు మొబైల్ సేవలు అందడం లేదని, ఈ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌లేని గ్రామాలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని టెలికాం సంస్థలు ముందుకు వచ్చి టవర్లు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రధాన టెలికాం ఆపరేటర్లతో కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో మొబైల్ టవర్ల ఏర్పాటు, వాటికి అనుమతుల మంజూరుపై సమీక్షించారు. రామభద్రపురం మండలం ఎనుబరువు, ఎస్.కోట మండలం పల్లపు దుంగాడ, గంట్యాడ మండలం డీకేపర్తి తదితర ప్రాంతాల్లో టెలికాం సిగ్నల్ అందడంలేదని, రానున్న ఎన్నికల దృష్ట్యా ఈ గ్రామాల్లో వెంటనే టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మార్చి నెలాఖరులోగా ఎస్.కోట, గంట్యాడ, రామభద్రపురం మండలంలోని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్, రిలయన్స్, జియో సంస్థల్లో ఏ సంస్థ ద్వారా అవకాశం ఉంటే వారితో ఏర్పాటు చేస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, కలెక్టరేట్ ఎన్నిక విభాగం సూపరింటెండెంట్, బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ప్రతినిధులు, ఫైబర్‌నెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోండ్రుపై గాండ్రింపు

- సొంత పార్టీ నుంచి నిరసన సెగ
- టికెట్ ఇవ్వద్దంటూ టడీపీ మాజీ ఎంపీపీల సమావేశం



కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా సమావేశమైన టీడీపీ మాజీ ఎంపీపీలు

రేగిడి: రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోండ్రు మురళీమోహన్‌కు నిరసనసన సెగ రోజురోజుకూ అధికమవుతోంది. కొద్దికాలంగా కోండ్రు మురళీమోహన్ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. గత నెలలో రాజాంలో జరిగిన లోకేష్ శంఖారావం సభలో కూడా ఈ వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. ఇవేమీ పట్టించుకోకుండా టీడీపీ అధిష్టానం రాజాం అసెంబ్లీ అభ్యర్థిగా కోండ్రు మురళీమోహన్‌ను ప్రకటించింది. దీంతో ఆ పార్టీకి చెందిన రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రేగిడి గ్రామంలో మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు ఇంటి వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు, వంగర మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, రేగిడి మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, రాజాం మున్సిపాల్టీకి చెందిన సీనియర్ నేత శాసపు కేశవనాయుడు, రాజాం మండలానికి చెందిన దుప్పలపూడి నాగేశ్వరరావు తదితరులతో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు సమావేశమయ్యారు.

భారీ తేడాతో ఓటమి ఖాయం

నియోజకవర్గంలో కోండ్రు మురళీమోహన్‌పై పూర్తిగా వ్యతిరేకత ఉందని, ఆయనకు టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కనీసం పార్టీపరంగా బాధ్యతాయుతమైన కార్యక్రమాలు కూడా ఆయన చేయలేదనే విషయాన్ని తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. సౌమ్యులుగా ఉన్న వ్యక్తులకు ఇక్కడ టికెట్ ఇవ్వాలని, లేకుంటే భారీ ఓట్లతో ఓడిపోతామని వారంతా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును కలిసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. తమ మనసులో మాట నియోజకవర్గ టీడీపీ తమ్ముళ్లు తరపున తెలపడం, అప్పటికీ పార్టీ పెద్దలు గౌరవించకుటే తామంతా సొంత నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వివరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. రాజాం నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి అవకాశం ఇవ్వాలని మాజీ ఎంపీపీలు పట్టుబడుతున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో 50కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో టీడీపీకి చెందిన 50కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుండడంతో వారంతటవారే వచ్చి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బి.గోవింద, జి.అప్పలనాయుడు, ఎస్.గౌరునాయుడు, ఎల్.వెంకటరమణ, పి.సత్యంనాయుడులకు చెందిన కుటుంబాలవారు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.శారద, ఏఎంసీ డైరెక్టర్ బి.కృష్ణ, పి.నారాయణరావు, మహేష్ మాస్టారు, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, పి.మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలోని పారాది, కొండదేవుపల్లి గ్రామాలకు చెందిన మావిరెడ్డి సూర్యచంద్రరావు, బోరపు రెడ్డి ప్రమీలకు రూ.2.5లక్షలు, రూ.2లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే శంబంగి కృషి చేశారు. ఈ మొత్తాలను చెక్కుల రూపంలో శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, పూడి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన లెంక వరహాలు మెడలో పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బాధితురాలు వరహాలు భర్త రామకృష్ణతో కలిసి విజయనగరం మండలం అయ్యన్నపేట గ్రామంలో జరుగుతున్న ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా గొడియాడ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు తెంచి పారిపోయారు. దీంతో బాధితులు గంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.